క్లుప్తంగా

ప్రయాణం.. ప్రమాదం!



పాయకాపురం(విజయవాడరూరల్): బర్మా కాలనీ (64వ డివిజన్) హైగ్రీవ స్కూల్ రోడ్డులో డ్రైనేజీ కాలువపై ఉన్న ఐరన్ గ్రిల్ విరిగిపోయింది. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పాదచారులు ఆదమరిచి నడుచుకుంటూ వెళితే పడిపోయే ప్రమాదం వుందని.. అలాగే ద్విచక్ర వాహన దారులు గ్రిల్స్‌పై వెళితే డ్రైనేజీ కాలువలో పడి ప్రమాదానికి గురవుతారని స్థానికులు వాపోతున్నారు. దీనిపై వీఎంసీ అధికారులు వెంటనే స్పందించి విరిగిన ఆ ఐరన్ గ్రిల్స్ మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీసీడీఈ మోడల్ ఇన్‌స్టిట్యూట్‌గా నలంద



లబ్బీపేట(విజయవాడతూర్పు): బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ పైలెట్ ప్రాజెక్ట్ మోడల్ ఇన్‌స్టిట్యూట్‌గా నలంద డిగ్రీ కళాశాల ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ప్రేరణ మిత్ర యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకుని దానిలోని మాడ్యూల్స్ ద్వారా 13 ప్రైమరీ గవర్నమెంట్ స్కూల్స్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. వారికి అనేక అంశాల్లో బోధిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థుకు శుక్రవారం స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష బి. శ్రీనివాసరావు, బీడీసీఈ కార్యదర్శి ఎంఎల్ఎస్ దేవకుమార్, శేషగిరి మధుసూదనరావు తదితరులు సర్టిఫికెట్స్ అందజేశారు.

అవధాన సరస్వతికి పద్యనీరాజనం



విజయవాడ కల్చరల్: సీతారామ కల్యాణ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని గిరి వీధిలో శుక్రవారం సంస్కృత పండితులు డాక్టర్ తాతా సందీప్ శర్మ నిర్వహించిన అష్టావధాన కార్యక్రమం సాహితీ పరిమళాలు వెదజల్లింది. డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ సంచాల కత్వంలో పీటీజీవీ రంగా చార్యులు నిషిద్ధాక్షరి, కుందా విజయరాం సమస్య, ముదిగొండ బాల కాత్యాయని దత్తపది, యడవల్లి రాజేశ్వరి వర్ణన, కావూరి సత్యవతి అప్రస్తు ప్రసంగం, యడవల్లి రాజేశ్వరి వర్ణన, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ పురాణపఠనం, దండిభొట్ల దత్తాత్రేయ శర్మ వ్యస్తాక్షరి, కొల్లావఝ్జల వెంకట శైలజ ఆశువు అంశాలను నిర్వహించారు. పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలను తాతా సందీప్ శర్మ తేలికగా ఎదుర్కొని అవధానాన్ని విజయవంతంగా ముగించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ రెసిడెన్సీ నందు వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మృతుడు గుడివాడ నాగవరప్పాడుకు చెందిన యడ్లపల్లి ప్రసాద్(60)గా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుని బంధువులు కానీ, తెలిసిన వారు కానీ గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ సిబ్బంది ధర్నా



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఎండీ పరిష్కరించడంలో విఫలమయ్యారని ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్ డిపో ముందు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరతూ ఆటోనగర్ డిపో కార్యదర్శి ఎంఎన్‌రావు ఆధ్వర్యంలో డిపో ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ గత వారం క్రితం ఆర్టీసీ ఎండీకి పలు సమస్యలకు సంబంధించి వినతి పత్రం ఇచ్చినప్పటికీ నేటికీ పరిష్కరించకుండా జాప్యం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాగే కాలయాపన చేస్తే భవిష్యత్‌లో తీవ్ర ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి మల్లేశ్వరరావు, నాయక్, మజ్దూర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా మధురానగర్ రైల్వేస్టేషన్

- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ దోపిడీలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



మధురానగర్ రైల్వేస్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ రైల్వేస్టేషన్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. నగరంలోనే రెండో రైల్వేస్టేషన్‌గా ఉన్న మధురానగర్ రైల్వేస్టేషన్‌లో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇక్కడ కనీసం రైల్వే పోలీసులను కూడా నియమించలేదు. దీంతో చీకటి పడేసరికి ఆకతాయిలు ఇక్కడకు చేరుకుని మద్యం, గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వాగ్వాదానికి దిగుతున్నారు. దీంతో తమకు ఎందుకులే అని సామాన్యులు మిన్నకుండి పోతున్నారు. దీన్ని అవకాశంగా చేరుకుని అకతాయిలు మరింతగా పేట్రేగిపోతున్నారు. ఇక్కడ రైల్వేస్టేషన్ పరిసరాలు విశాలంగా ఉండటంతో పాటు చుట్టూ తప్పించుకోవటానికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. దీంతో పోలీసులు వచ్చేసరికి వారు తప్పించుకు పారిపోతున్నారు. రాత్రిపూట ఎవరైనా ప్రయాణికులు, వాహన చోదకులు కనిపిస్తే వారి వద్ద నుంచి బలవంతంగా అందిన కాడికి దోచుకుంటున్నారు. దీంతో ఈ ప్రాంతానికి రావాలంటేనే హడలిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రైల్వేస్టేషన్‌లో ఆకతాయిల బారి నుంచి తమను కాపాడాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోలీసు రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి..

ఇక్కడ రైల్వే పోలీసు రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి భద్రతను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. రైల్వేస్టేషన్ కావడంతో రైల్వే పోలీసులు చూసుకుంటారని పోలీసులు, పోలీసులు చూసుకుంటారని రైల్వేపోలీసులు ఇక్కడ పట్టించుకోవటం లేదని.. ఏదైనా ఘటన జరిగినప్పటికీ పోలీసులు రావటానికి ఎక్కువ సమయం పడుతుందని.. దీంతో ఆకతాయిలు దర్జాగా వెళ్లిపోతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆకతాయిల బెడదకు మధురానగర్ పరిసర ప్రాంతాలకు చెందిన వారు సైతం రాత్రిపూట విజయవాడ మెయిన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లిపోయి తిరిగి వస్తున్నారు.

రైల్వేస్టేషన్ పరిసరాలలో చోరీలు..

మధురానగర్ రైల్వేస్టేషన్ పరిధిలో ఆకతాయిలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాలలోని పెట్రోల్, బ్యాటరీలు చోరీ చేస్తున్నారు. అలాగే ఇంటి బయట ఉంచిన వస్తువులను సైతం కాజేస్తున్నారు. దీంతో ఇక్కడ నివాసితులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

అనధికార పార్కింగ్‌లు..

మధురానగర్ రైల్వేస్టేషన్ వద్ద అనధికార పార్కింగ్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక్కడ ఇష్టారాజ్యంగా ప్రైవేటు వ్యక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు అధికంగా వచ్చే సమయాల్లో పార్కింగ్‌కు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు తగు చర్యలు తీసుకుని మధురానగర్ రైల్వేస్టేషన్‌ను ఈ సమస్యల నుంచి రక్షించాలని స్థానికులు వేడుకుంటున్నారు.



స్టేషన్ వద్ద అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనాలు

డబ్బులు లాక్కుంటున్నారు..



మా బంధువుల ఇంటికి వెళ్లేందుకు నేను ఇక్కడ రైల్వేస్టేషన్‌లో దిగాను. అయితే ఇక్కడ రాత్రిపూట ఆకతాయిలు చేస్తున్న ఆగడాలు భరించలేనివిగా ఉన్నాయి. నోటికి వచ్చినట్లు మాట్లాడటంతో పాటు జేబులో డబ్బులు బలవంతంగా లాక్కుంటున్నారు.

–డి. నాగు, ప్రయాణికుడు

భయభ్రాంతులకు గురిచేస్తున్నారు..



ఇక్కడ రైల్వేస్టేషన్‌లో రాత్రిపూట దిగాలంటేనే భయంగా ఉంది. రాత్రి సమయంలో బిక్కుబిక్కుమంటూ బయటకు రావాల్సి వస్తుంది. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం పైనే మద్యం సేవిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

– జి.శశాంక్, ప్రయాణికుడు

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

వీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రశేఖర్



లోడర్ పాయింట్ వద్ద పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరం నిరంతరం శుభ్రంగా ఉండాలని, ప్రధాన వీధుల నుంచి సందుల వరకు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా సర్కిల్–1 పరిధిలో గల గాంధీ హిల్, పరిసర ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జెండా చెట్టు వద్ద ఉన్న లోడర్ పాయింట్ పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, రోడ్లపైన వ్యర్థాలు ఎవరూ వేయకుండా ఎప్పటికప్పుడు ఇంటి వద్దే సేకరణ చేసేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. గాంధీ హిల్ వద్ద అవుట్ ఫాల్ డ్రెయిన్లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎక్సలేటర్ ద్వారా తీస్తున్న వ్యర్థాలను పరిశీలించి ఎప్పటికప్పుడు వ్యర్థాలన్నీ తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గాంధీ మహిళా కళాశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. టోకెన్లు సమయానికి ఇస్తున్నారా లేదా, అన్న క్యాంటీన్ సమయపాలన పాటిస్తున్నారా లేదా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు లేదా వంటి అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలు ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్షర జ్యోతిని వెలిగించిన మహనీయులు పూలే



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): దేశంలో అక్షర జ్యోతిని వెలిగించిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో శుక్రవారం డిప్యూటీ మేయరు అవుతు శైలజా రెడ్డితో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పాటు పడిన దీనజన బాంధవుడు జ్యోతి రావు పూలే అన్నారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నడిపారని గుర్తు చేశారు. స్త్రీలకు విద్యను అందించడం కోసం తన భార్య సావిత్రీబాయికి చదువు చెప్పి ఉపాధ్యాయురాలిగా మలిచిన మహోన్నత వ్యక్తిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు యరగొర్ల శ్రీరాములు, అలంపూర్ విజయ్, ఇసరపు రాజా రమేష్, మేడా రమేష్, తోపుల వరలక్ష్మి, శ్యామ్, యర్రంశెట్టి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని ఎస్ఆర్ఆర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.ఎస్.వి.ఎస్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు పూలే చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. సామాజిక అసమానతుల మీద అలుపెరగని పోరాటం చేసి అనగారిని వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే అని పేర్కొన్నారు. డాక్టర్ కొల్లేటి రమేష్, చరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ 'నమస్తే' పథకంపై అవగాహన



సమావేశంలోమాట్లాడుతన్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రాజరాజేశ్వరి పేట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బిల్డింగ్‌లో రాగ్ పిక్కర్స్ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. రాగ్ పిక్కర్స్ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అందించే 'నమస్తే పథకం'తో వారికి ఎంతో మంచి చేకూరుతుందన్నారు. వారికి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా, ఉన్నతమైన చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఒక వెహికల్ సమకూర్చినందుకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. అర్హులైన వారి ఆధార్ కార్డు లింకేజ్ చేస్తూ, వారికి జీరో బ్యాలెన్స్ అకౌంటు బ్యాంకులో తెరిచేందుకు తాము ప్రొఫైలింగ్ చేస్తున్నామని చెప్పారు. ఈ పథకానికి నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ బాబు శ్రీనివాస్‌ను నియమించామని, రాగ్ పిక్కర్స్‌కు ఏవైనా సందేహాలుంటే ఆయన అందుబాటులో ఉంటారని తెలిపారు. స్వర్ణాంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, దళిత్ బహుజన్ రిసోర్స్ సెంటర్ సీఈవో అల్లాడి దేవకుమార్, డెప్యూటీ డైరెక్టర్ సామ్యూల్ అనిల్ కుమార్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాల్ కృష్ణ నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



డాక్టర్ బి.వసంతకుమార్



డాక్టర్ ఎక్కటివిజయ దుర్గాపావని



డాక్టర్ పి.రాజేశ్వర శర్మ

మధురానగర్(విజయవాడసెంట్రల్): లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవం అయ్యింది. లయన్స్ క్లబ్స్ విజయవాడ అంజలి, దుర్గాతేజ, గీతాంజలి కార్యవర్గ సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నిక లయన్స్‌క్లబ్ కార్యాలయంలో జరిగింది. క్లబ్స్ వ్యవస్థాపకులు కోల్లూరి, క్లబ్ జోన్ ఛైర్ పర్సన్ డాక్టర్ ఎక్కటి సుధాకర్ బాబు నూతన కార్యవర్గం ఎన్నిక అధికారులుగా వ్యవహరించారు. లయన్స్‌క్లబ్ విజయవాడ అంజలి అధ్యక్షులుగా డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, సెక్రటరిగా బోడి ఆంజనేయరాజు, కోశాధికారిగా పల్లా తలుపులు.. లయన్స్ క్లబ్ దుర్గాతేజ అధ్యక్షులుగా డాక్టర్ ఎక్కటి విజయ దుర్గా పావని, సెక్రటరిగా ఎక్కటి జ్యోతి, ట్రెజరీగా కె.నాగరోజ రమణి.. లయన్స్ క్లబ్ గీతాంజలి అధ్యక్షులుగా డాక్టర్ పురాణం రాజేశ్వర శర్మ, సెక్రటరిగా వి.సర్వేశ్వర రావు, ట్రెజరర్‌గా మంటాడ నాంచారయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ సభ్యులు గుర్రం ఏడుకొండలు కె.జె.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధే ప్రధాన అజెండా

శాప్ ఛైర్మన్ రవినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

విజయవాడస్పోర్ట్స్: క్రీడల అభివృద్ధే ప్రధాన అజెండాగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కార్యకలాపాలను విస్తృతం చేయాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కార్యాలయం అధికారులకు సూచించారు. విజయవాడలోని శాప్ కార్యాలయ సమావేశ మందిరంలో క్రీడల అభివృద్ధి, సమ్మర్ క్యాంపుల నిర్వహణపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా సంఘాలను సమన్వయం చేసుకొని ఏపీలో పెద్ద సంఖ్యలో క్రీడా పోటీలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. క్రీడా సమాఖ్యలు నిర్వహించే జాతీయ క్రీడలను రాష్ట్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో నిర్వహించనున్న సమ్మర్ క్యాంపులను సమర్థవంతంగా నిర్వహించాలని.. ఏప్రిల్ 20వ తేదీ నాటికి అన్ని జిల్లాల డీఎస్‌డీవోలకు సర్క్యులర్ జారీ చేయాలన్నారు. క్యాంపుల నిమిత్తం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి ప్రతి జిల్లాకు కోచ్‌ను నియమించాలని.. విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన క్రీడా యాప్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రీడా యాప్‌లో లేని అసోసియేషన్‌లు, క్రీడాకారులకు సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు పడతారన్నారు. కార్యాలయ పరిపాలన అధికారి ఆర్.వెంకటరమణనాయక్, స్పోర్ట్స్ ఆఫీసర్లు కోటేశ్వరరావు, మహేష్, సురేంద్ర, కిషోర్, సూపరింటెండెట్ మల్లీశ్వరీ, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సిద్ధయ్య పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా

విజయవాడలీగల్: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని గులాబీతోట ఏరియాకు చెందిన ఇద్దరు స్నేహితులు క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి, విశాఖపట్నం కంచరపాలెం గ్రామానికి చెందిన బండి సురేష్(39) పరిచయమయ్యారు. విద్యుత్‌శాఖలో రికార్డు అసిస్టెంట్ పోస్టులు పడుతున్నాయని, ఆ ఉద్యోగాలు వారికి ఇప్పిస్తానని చెప్పి, ఇద్దరు స్నేహితుల నుంచి సురేష్ వెరిఫికేషన్ నిమిత్తం చెరో రూ. 5 వేలు తీసుకున్నాడు. దరిమిలా 2021 మార్చి 15వ తేదీన ఫోన్‌చేసి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మరో రూ. 45 వేలు వసూలుచేశాడు. తర్వాత సురేష్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తప్పించుకు తిరుగుతున్నట్లు సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సురేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యు.ఉమాపతి, సీఐఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, అప్పటి సత్యనారాయణపురం మహిళా ఎస్ఐ సీహెచ్.నాగదుర్గ పర్యవేక్షణలో నలుగురు సాక్షులను విచారించారు. విచారణలో నిందితునిపై నేరం రుజువైనందున శుక్రవారం మూడో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి నామాల జ్యోతి నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

12 మందికి జరిమానా

విజయవాడలీగల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందికి 8వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు జరిమానా విధించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో 5వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో నలుగురికి ఒక్కొక్కరికి 15వేలు, 8 మందికి ఒక్కొక్కరికి 10వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేయడం జరుగుతుందని అన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమిషనర్ సూచించారు.

సెలవు రోజుల్లో కూడా పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థకు చెల్లించే ముందస్తు పన్నుల చెల్లింపుదారుల కోసం సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లన్నీ అందుబాటులో ఉంచుతున్నట్లు వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయలపై 50% వడ్డీ రాయితీ, 2025– 26నకు ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ నెల 30 తేదీ వరకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న 13 క్యాష్ కౌంటర్లు, 286 సచివాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. పన్నుల చెల్లింపుదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో కూడా అవకాశం కల్పించిందని, www.cdma.apgov.in వెబ్‌సైట్ ద్వారా, పురమిత్ర యాప్‌ద్వారా కూడా పన్నులు చెల్లింపులు చేయవచ్చని తెలిపారు.

వైభవంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని దేవీనగర్ మధ్యకట్ట విజయదుర్గా నగర్‌లోని శ్రీ విజయదుర్గాదేవీ సమేత విజయేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం భక్తజన సందోహం నడుమ కనులపండువగా జరిగింది. ఈ వేడుకలలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టతో ఈ ప్రాంతం కొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని ఆయన అన్నారు. శబరిగిరీశునికి విశిష్ట పూజలు నిర్వహించడం ఎంతో మహా భాగ్యమని పేర్కొన్నారు. స్వామి ఆశీస్సులు నియోజక వర్గ ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ రైల్వే స్టేషన్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు తెలిపారు. పూర్ణానందం పేట, రైల్వేస్టేషన్, ఆర్‌ఈ కాలనీ, వెహికిల్ డిపో, ఇరిగేషన్ క్వార్టర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలోని దుర్గాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని 11కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మత్తు పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహణ ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. దుర్గాపురం, బీఆర్టీఎస్ రోడ్డు, పున్నయ్య కాలనీ, గులాబీతోట, భాను నగర్, రాజీవ్ గాంధీ రోడ్డు, సంగీత కళాశాల రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, భావాజీ పేట, రామా నగర్, రామకోటి మైదానం రోడ్డు, నూరి హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేయనున్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



ఉగాది పురస్కారాల గ్రహీతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి, రాగసుధామయి క్రియేషన్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం సినీ సంగీత విభావరి, ఏపీ ప్రభుత్వ ఉగాది పురస్కారాల గ్రహీతలకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. జి.నారాయణరావు మాట్లాడుతూ.. సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులని అభివర్ణించారు. బోడి అంజనేయరాజు, కె.డేవిడ్‌రాజు, ప్రసంగించారు. రవికుమార్, శేఖర్, భాస్కర్, వైవీ రమణ,మురళీ కృష్ణ,శారదా శ్రీ, మోహనలక్ష్మి, కందుల లక్ష్మి, రూపశ్రీ, రామలక్ష్మి తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. ఉగాది పురస్కారాల గ్రహీతలు దామోదర గణపతి రావు, డాక్టర్ శేషుకుమార్, ఆర్.రాజేష్‌లను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం



విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

వివరాలు వెల్లడించిన సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యుత్ సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మరో ప్రజా ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సీపీఎం నగర కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు అమలు జరుపకుండా ప్రజల నడ్డి విరిచే రీతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారాలు మోపడం శోచనీయమన్నారు. ఒకవైపు విద్యుత్ సర్దుబాటు చార్జీలు, మరోవైపు గ్యాస్ ధరలు, పెట్రోల్, డీజిల్‌పై పన్నుల పెంపు, ఇంటి పన్ను, పాలు, నిత్యావసర వస్తువుల ధరల పెంపు వంటి రూపాల్లో ప్రజలపై భారాలు వేస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలన, పీ4 అంటే ఇదేనా? పేదలను కోటీశ్వరులు చేయటమంటే ఇదేనా? అని ప్రశ్నించారు. ఒకేసారి నాలుగు రకాల సర్దుబాటు చార్జీలు వసూలు చేయటం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు తిప్పికొట్టాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అంటించాలని, వీధి వీధినా సమావేశాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని, భవిష్యత్తులో ప్రత్యక్ష ప్రతిఘటనకు సిద్ధం కావాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, కె.శ్రీదేవి, నగర నేతలు పాల్గొన్నారు.

జగన్మాతకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీసాయిరామ్ నృత్య అకాడమీకి చెందిన కళాకారులు ప్రదర్శించిన కూడిపూడి నాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద కళావేదికపై భాగవతుల శ్రీనివాస్ శర్మ పర్యవేక్షణలో పలువురు కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు ఆద్యంతం నృత్య ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.